చిన్నబోయిన చంద్రుడు



చిత్తూరులో ఆదివారం రాత్రి 10.35 నుంచి 10.50 గంటల మధ్య కనిపించిన చంద్రగ్రహణం దృశ్యాలు

● చంద్రగ్రహణం ఎఫెక్ట్







ఆలయాల మూత

కాణిపాకంలోని వరసిద్ధుడి ఆలయాన్ని మూసివేస్తున్న ఈవో పెంచలకిషోర్, ప్రధాన అర్చకుడు సోమశేఖర్ గురుకుల్ - మూసివేసిన బోయకొండ గంగమ్మ ఆలయం - మూసివేసిన కార్వేటినగరంలోని వేణుగోపాల స్వామి ఆలయం వద్ద అధికారులు, సిబ్బంది

- వివరాలు 7లో..

ఒక్కొక్కటిగా..

నిండుతున్న కుప్పం చెరువులు



నిండుతున్న వీరప్పనాయని చెరువు

● వీరప్పనాయని చెరువుకు చేరుతున్న కృష్ణా జలాలు

కుప్పం నియోజకవర్గం ఆకుపచ్చగా మురిసిపోవడం ఇక ఎంతో దూరంలో లేదు. భూగర్భ జలాలు పన్నెండు వందల అడుగుల లోతు నుంచి పైపైకి ఎగసి రావడానికి అట్టే సమయం పట్టదు. 733 కిలోమీటర్ల దూరం నుంచి తరలివస్తున్న కృష్ణమ్మ.. ఇక్కడి చెరువులను ఒక్కొక్కటిగా నింపుకుంటూ వెళుతుండటం వల్లే ఇవి సాధ్యం కాబోతున్నాయి.



నిండిన పరసముద్రం చెరువు

కుప్పం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): హంద్రీ-నీవా కాలువ ద్వారా నిండేలా నిర్దేశించిన చెరువుల్లో రెండోదైన వీరప్పనాయని చెరువుకు రెండ్రోజులుగా కృష్ణా జలాలు రావడం, నిండటం ప్రారంభమైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు గతనెల 30వ తేదీన కుప్పం పురపాలక సంఘం పరసముద్రం చెరువు వద్ద హంద్రీ-నీవా కాలువలో కృష్ణా జలాలకు జలహారతి ఇచ్చి, ఇక్కడే బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి ప్రసంగించిన విషయం తెలిసిందే. ఆయనలా అమరావతి బయల్దేరగానే విపక్ష వర్గాలు కాలువ ఎండిపోయిందంటూ అసత్య ప్రచారానికి తెరలేపాయి. వి.కోట సమీపంలో తాత్కాలిక సాంకేతిక పరమైన సమస్యతో ఆగిన పంపింగ్, అప్పటికప్పుడే తిరిగి ప్రారంభమై కృష్ణా జలాలు హంద్రీ-నీవా కాలువలో రామకుప్పం, శాంతిపురం, గుడుపల్లె మండలాల మీదుగా ఆఖరి మజిలీ అయిన పరసముద్రం చెరువులోకి దుమికాయి. ఈ చెరువు పూర్తిగా నిండి, ఈనెల 4న మొరవ కూడా పారింది. ఈ మొరవ ద్వారా పారుతున్న నీళ్లు, సప్లయ్ చానల్‌లో సుమారు ఒకటిన్నర కిలోమీటర్ల దూరం ప్రయాణించి కుప్పం పురపాలక సంఘం టూరిజం హోటల్‌ను ఆనుకుని ఉన్న వీరప్పనాయని చెరువుకు చేరుతున్నాయి. ఆదివారం సాయంత్రానికి సగానికిపైగా చెరువు నిండింది. ఇదే వేగంతో కృష్ణా జలాలు ప్రవహిస్తే మరో రెండు, మూడ్రోజుల్లో ఈ చెరువు పూర్తిగా నిండి, మొరవ పారి దిగువనున్న కుప్పం మండలం పెద్దబంగారునత్తం చెరువులోకి కృష్ణా జలాలు చేరే అవకాశం ఉంది. ఇలా.. దిగువన నియోజకవర్గంలోని అన్ని మండలాల పరిధిలోని చెరువులను నింపేదాకా ఈ ప్రక్రియ కొనసాగుతుందన్నమాట.

పటిష్ఠమవుతున్న చెరువు కట్టలు





వీరప్పనాయని చెరువు కట్టకు మరమ్మతులు - పటిష్ఠమైన పరసముద్రం చెరువు కట్ట

దాదాపు ముప్పయ్యేళ్లుగా కుప్పం నియోజకవర్గంలో కరువు విలయతాండవం చేస్తోంది. భారీ వర్షాలొస్తే తప్ప మిగిలిన రోజుల్లో నియోజకవర్గంలోని చెరువులు దాదాపు ఖాళీగానే ఉంటాయి. అందువల్ల ప్రభుత్వం కూడా చెరువుల పటిష్ఠత కోసం, కట్టల బలోపేతం కోసం తీసుకున్న చర్యలు అంతంత మాత్రంగానే ఉంటూ వచ్చాయి. ప్రస్తుతం కృష్ణా జలాలు తరలివస్తుండడంతో చెరువు కట్టలను పటిష్ఠం చేసే పనులు సూక్ష్మ నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో సాగుతున్నాయి. తొలుత పరసముద్రం చెరువు విషయంలో ఈ పనులు శరవేగంగా సాగాయి. ఇప్పుడిప్పుడే నిండుతున్న వీరప్పనాయని చెరువు కట్టను బలోపేతం చేసే పనులూ చురుగ్గా సాగుతున్నాయి. గతంలో ఈ చెరువు కట్టమీదుగానే పలమనేరు-కృష్ణగిరి బైపాస్ రోడ్డు సాగేది. పక్కనే ఫ్లైఓవర్ నిర్మించడంతో ఈ మార్గం మూసుకుపోయి, కోళ్ల వ్యర్థాలతోపాటు నానారకాల చెత్తాచెదారాలను వదిలించుకునే అనధికారిక డంపింగ్ యార్డుగా మారిపోయింది. ఇప్పుడు ఈ వ్యర్థాలను తొలగించడంతో పాటు చెరువు కట్టను చదును చేసే పనులు జరుగుతున్నాయి. ఇదేరీతిలో నియోజకవర్గంలోని అన్ని చెరువుల పటిష్ఠతకు చర్యలు తీసుకోవడానికి అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది.



రావణబ్రహ్మ వాహనంపై సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధుడు

రావణబ్రహ్మ వాహనంపై విఘ్ననాథుడి విహారం

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం రావణబ్రహ్మ వాహనంపై సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధుడు విహరించాడు. ఈ కార్యక్రమానికి పుణ్యసముద్రం, లక్ష్మాంబపురం, సంతపల్లె, ద్వారకాపురం, కురప్పల్లె, సిద్ధంపల్లె, ముద్దురామాపురం గ్రామాలకు చెందిన గ్రామస్తులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఉభయదారులు ఉభయ వరుస తీసుకురావడంతో ఆలయ అలంకార మండపంలో ఉత్సవర్లకు పూజలు చేశాక రావణబ్రహ్మ వాహనంపై అధిష్ఠింపజేసి, కాణిపాక పురవీధుల్లో ఊరేగించారు. స్వామివారిని దర్శించుకోవడానికి వందలాదిగా భక్తులు తరలివచ్చారు. ఆలయ ఈవో పెంచలకిషోర్, ప్రధాన అర్చకుడు సోమశేఖర్ గురుకుల్, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఇన్‌స్పెక్టర్లు చిట్టిబాబు, బాలాజీనాయుడు, ఉభయదారులు పాల్గొన్నారు. ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా సోమవారం వరసిద్ధుడికి యాళి వాహన సేవ నిర్వహించనున్నారు.

కలెక్టరేట్‌లో నేడు 'పీజీఆర్ఎస్'

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి అర్జీలను తీసుకుంటారన్నారు. జిల్లా అధికారులందరూ విధిగా ఈ కార్యక్రమానికి హాజరుకావాలని సూచించారు. అలాగే డివిజన్, మండల స్థాయిల్లో పీజీఆర్ఎస్ నిర్వహించాలని ఆదేశాలిచ్చారు.

● జిల్లా పోలీసు కార్యాలయంలోనూ సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పీజీఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని ఎస్పీ మణికంఠ తెలిపారు. బాధితులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పంటలపై ఆగని 'గజ' దాడులు





ఏనుగులు తొక్కేసిన వరిపంట - ధ్వంసమైన అరటి

కల్లూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలోని పంటలపై ఏనుగుల గుంపు దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. వరి, కొబ్బరి, మామిడి, టమోటా పంటలకు అపారనష్టం వాటిల్లుతోంది. దీంతో అటవీ సరిహద్దు ప్రాంతాల్లోని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. శనివారం రాత్రి పశ్చిమ విభాగం అటవీ ప్రాంతంలోని గోగులమ్మ వంక నుంచి బయల్దేరిన 14 ఏనుగుల గుంపు పాతపాళ్యం అడవి మార్గంలో సురేష్‌కు చెందిన పొలంలో చొరబడి మామిడిచెట్ల కొమ్మలను విరిచేశాయి. నటరాజ, ఈశ్వర్‌కు చెందిన పశుగ్రాసాన్ని తినేశాయి. అక్కడినుంచి పాతపేట వద్దకు చేరుకుని కుప్పయ్య, సుబ్రహ్మణ్యంకు చెందిన అరటిచెట్లు, పశుగ్రాసాన్ని తొక్కేసి, మామిడితోటకు అమర్చిన రాతికూసాలను విరిచేశాయి. కల్లూరులోని కోన్‌బాషాకు చెందిన మామిడిచెట్ల కొమ్మలను, రాతికూసాలను ధ్వంసం చేశాయి. కల్లూరు నుంచి గంటావారిపల్లెకు వెళ్లే రోడ్డును దాటుకున్న ఏనుగులు తలారివారిపల్లె వద్దకు చేరుకున్నారు. కల్లూరులోని శేషాద్రి, కోదండయ్య, లక్ష్మీనారాయణ, మహబూబ్ బాషా, ఖాదర్ బాషాకు చెందిన మామిడిచెట్లను ధ్వంసం చేసిన ఏనుగులు రాతికూసాలను విరిచేశాయి. అటు నుంచి అటే అడవిలోకి తిరుగుముఖం పట్టిన ఏనుగులు పెద్దవంక వద్దకు చేరుకున్నాయి. ఆదివారం పగలంతా పెద్దవంకలో తిష్ఠ వేసినట్లు స్థానికులు తెలిపారు. ఆదివారం ఉదయం సుమారు ఎనిమిది గంటల సమయంలో కల్లూరు నుంచి గంటావారిపల్లెకు వెళ్లే రోడ్డుకు సమీపంలో ఒంటరి ఏనుగు సంచరిస్తూ స్థానికుల కంటపడింది. యువకులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకుని కేకలు పెట్టడంతో ఆ ఏనుగు అడవిలోకి వెళ్లిపోయింది.



కల్లూరు సమీపంలోని అడవిలో తిరుగుతున్న ఒంటరి ఏనుగు

పాపిరెడ్డిగారిపల్లె వద్ద ఒంటరి ఏనుగు

పులిచెర్ల మండలం గడ్డంవారిపల్లె పంచాయతీ పాపిరెడ్డిగారిపల్లె సమీపంలో రెండ్రోజులుగా పంటలను ఒంటరి ఏనుగు ధ్వంసం చేయడంతో అపారనష్టం జరుగుతోంది. తిరుపతి జిల్లాలోని కల్యాణి డ్యాం నుంచి రెండ్రోజుల కిందట పులిచెర్ల మండలం సరిహద్దులోని తూర్పు విభాగం అటవీ ప్రాంతం మూలమడుగు వద్దకు ఈ ఒంటరి ఏనుగు చేరుకుంది. శనివారం రాత్రి పాపిరెడ్డిగారిపల్లెలోని రైతులు మునిరాజ, నాగరాజు, చిరంజీవి, శ్రీధర్, రెడ్డెప్పకు చెందిన వరి, కొబ్బరి, వేరుశనగ, టమోటా, అరటి, మామిడిచెట్లను ధ్వంసం చేసింది.

ముగ్గురు ఎంపీడీవోలకు పదోన్నతి

చిత్తూరు రూరల్,సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 46 మంది ఎంపీడీవోలకు పదోన్నతిని కల్పిస్తూ ప్రభుత్వం శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో ఉమ్మడి జిల్లాకు చెందిన ముగ్గురు ఉన్నారు. వీరికి స్థానాలను కూడా కేటాయించారు. ఐరాల ఎంపీడీవో ధనలక్ష్మిని చిత్తూరు డ్వామా ఏపీవోగా, తిరుపతి ఎంపీడీవో కె.రామచంద్రను పలమనేరు డీడీవోగా, శ్రీకాళహస్తి ఈటీసీలో వెటర్నరీ ఆఫీసర్‌గా పనిచేస్తున్న అమర్నాథ్‌ను అక్కడే కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, కడప జిల్లా సంబేపల్లి ఎంపీడీవో ఎస్.రామచంద్రను కుప్పం డీడీవోగా, నెల్లూరు డ్వామా ఏపీవోగా పనిచేస్తున్న ఎం.ధనలక్ష్మిని పలమనేరు డ్వామా ఏపీవోగా నియమించారు.

నాలుగు మండలాల్లో వాన

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గడిచిన 24 గంటల్లో నాలుగు మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. పెనుమూరులో 7, పుంగనూరులో 3.4, గంగవరంలో 3, చిత్తూరు అర్బన్‌లో 1.8 మి.మీ వర్షపాతం నమోదైంది.

క్వారీపై రగడ..?

నిర్వాహకులు, స్థానికుల మధ్య ఘర్షణ

పలువురికి గాయాలు

-7లో

ఎరువులు సరిహద్దులు దాటకుండా నిఘా పెట్టండి

● అధికారులకు కలెక్టర్ ఆదేశం

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఇబ్బంది లేకుండా సోమవారం నుంచి రైతు సేవా కేంద్రం(ఆర్ఎస్‌కే)ల్లో ఎరువుల పంపిణీని పకడ్బందీగా ఏర్పాటు చేయాలని, ఇందుకోసం రెవెన్యూ, పోలీసు శాఖలను సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా నుంచి నల్ల బజారులో ఎరువుల అమ్మకాలు జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే సరిహద్దులు దాటి ఎరువుల బస్తాలు తరలిపోకుండా పటిష్ఠమైన నిఘా ఏర్పాటు చేయాలన్నారు. సీడీసీఎంఎస్‌ల ద్వారా సింగిల్ విండోలకు ఎరువుల కోసం వచ్చే రైతులకు ఎండ తీవ్రత దృష్ట్యా షామియానా, కుర్చీలు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. మోతాదుకు మించి ఎరువుల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు.

ఆర్ఎస్ఐ ఇంట్లో చోరీ

ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన వైనం

పుంగనూరు రూరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు చింతలవీధిలోని రిజర్వు ఎస్ఐ హరిప్రసాద్ ఇంట్లో చోరీ జరిగిన సంఘటన ఆలస్యంగా ఆదివారం వెలుగు చూసింది. పుంగనూరుకు చెందిన హరిప్రసాద్ గతంలో కళ్యాణిడ్యాం పోలీసు ట్రైనింగ్ సెంటర్‌లో పనిచేసి కొంతకాలం నుంచి తిరుపతిలో ఆర్ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నారు. కుటుంబీకులు ఇంటికి తాళం వేసి 15 రోజుల కిందట తిరుపతికి వెళ్లారు. ఇదే అదనుగా దుండగులు చోరీకి పాల్పడ్డారు. మరోవైపు తిరుపతిలో ఉన్న ఎస్ఐ కుటుంబీకుల ఫోన్ చోరీ కావడంతో దానికి సంబంధించిన బిల్లులు పుంగనూరులోని ఇంట్లో ఉండటంతో వాటిని తేవాలని బంధువైన శ్రీకాంత్‌కు ఫోన్ చేసి చెప్పారు. ఆయన ఇంటి వద్దకు వెళ్లేసరికి చోరీ విషయం బయటపడింది. సమాచారం అందుకున్న సీఐ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ హరిప్రసాద్, చిత్తూరు క్లూస్ టీమ్ ఆదివారం సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఇంట్లోని రెండు బీరువాలు పగులకొట్టి మూడు గ్రాముల బంగారం, పది కిలోల వెండి చోరీకి గురైనట్లు ఆర్ఎస్ఐ తెలిపారు.

35 మామిడి చెట్ల నరికివేత


నరికేసిన మామిడి చెట్టును చూపిస్తున్న రైతు

వెదురుకుప్పం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం బొమ్మయ్యపల్లె పంచాయతీ రామకృష్ణాపురానికి చెందిన మాధవరాజు పొలంలో 35 మామిడి చెట్లను శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నరికివేసినట్లు బాధితుడు ఆదివారం తెలిపారు. ఈ మేరకు వెదురుకుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. తనకు న్యాయం చేయాలని కోరారు.

పీజీ అడ్మిషన్లకు ప్రభుత్వం పచ్చజెండా

● నేటి నుంచి ప్రక్రియ ప్రారంభం

● 22 నుంచీ పీజీ ఫస్టియర్ తరగతులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని యూనివర్సిటీలు, కాలేజీల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశానికి అడ్మిషన్లకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఆదివారం అడ్మిషన్ కమిటీ సమావేశమై నోటిఫికేషన్‌ను జారీ చేసింది. మంగళవారం నుంచి 15వ తేదీ దాకా వెబ్ కౌన్సెలింగ్‌కు రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించేందుకు అవకాశం కల్పించారు. 9 నుంచీ 16 వ తేదీ దాకా వెరిఫికేషన్ కోసం సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయాలి. 12 నుంచీ 17 వ తేదీ దాకా వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. 18న వెబ్ ఆప్షన్లు మార్పు చేర్పులు చేసుకోవచ్చు. 20న సీట్లు కేటాయిస్తారు. 22 నుంచీ 24వ తేదీ దాకా సీటు వచ్చిన కాలేజీల్లో రిపోర్టు చేయాలి. అదే సమయంలో ఈనెల 22 నుంచే పీజీ ఫస్టియర్ క్లాసులు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి షెడ్యూల్ విడుదల చేసింది.

ముగిసిన అమ్మవారి పవిత్రోత్సవాలు



పవిత్రమాలలతో అమ్మవారి ఉత్సవమూర్తి - పద్మసరోవరంలో చక్రత్తాళ్వార్‌ను మునక వేయిస్తున్న అర్చకులు

తిరుచానూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులోని పద్మావతి అమ్మవారి ఆలయంలో మూడు రోజులపాటు జరిగిన పవిత్రోత్సవాలు ఆదివారం మహాపూర్ణాహుతితో ముగిశాయి. సుప్రభాతసేవలో అమ్మవారిని మేల్కొపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. యాగశాలలో శాస్త్రోక్తంగా మహాపూర్ణాహుతి, శాంతిహోమం, కుంభప్రోక్షణ, నివేదన చేపట్టారు. ఉదయం 10 నుంచి 11.30గంటల వరకు కేటీ మండపంలో అమ్మవారి ఉత్సవమూర్తికి, సుదర్శన చక్రతాళ్వార్‌కు స్నపన తిరుమంజనం నిర్వహించారు. చక్రతళ్వార్‌ను పల్లకీపై ఊరేగింపుగా తీసుకెళ్లి పుష్కరిణిలో మూడు సార్లు మునక వేయించడంతో చక్రస్నానం ముగిసింది. జేఈవో వీరబ్రహ్మం, అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన కంచి స్వాముల చాతుర్మాస దీక్ష

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): తిరుపతి ద్వారకానగర్‌లోని కంచి కామకోటి మహాపాదుక మండపంలో పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి, సత్య చంద్రశేఖరేంద్ర సరస్వతి చేపట్టిన చతుర్మాస దీక్ష ఆదివారం ముగిసింది. ఇక్కడి పీఠం మండపంలో జూన్ 7వ తేదీన కంచి స్వాములు చతుర్మాస దీక్ష చేపట్టారు. దీక్ష ముగింపు సందర్భంగా ఆదివారం పాదుక మండపం నుంచి నగరవనం వరకు విశ్వరూప యాత్ర నిర్వహించారు. నగరవనం చేరుకుని భగవద్గీత 11వ అధ్యాయంలోని విశ్వరూపయోగ పారాయణం చేశారు. మంగళవారం వరకు కంచి స్వాములు పాదుక మండపంలోనే ఉండి తర్వాత కంచి పీఠానికి వెళ్లనున్నారు. నాడు విజయేంద్ర సరస్వతి తొలి చతుర్మాస దీక్ష ఆంధ్రప్రదేశ్‌లో జరగ్గా.. ఇప్పుడు సత్య చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి తొలి దీక్ష కూడా రాష్ట్రంలోనే జరగడం గమనార్హం.

ఆలయాల మూత

చంద్రగ్రహణాన్ని పురస్కరించుకుని పలు ఆలయాలు ఆదివారం మూతపడ్డాయి. గ్రహణానంతరం సోమవారం ఉదయం ఆలయాలను తెరిచి శుద్ధి, తదితర పూజలను చేశాక భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.




బోయకొండ గంగమ్మ - అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

కాణిపాక వరసిద్ధుడి ఆలయం మూసివేత

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం, అనుబంధ ఆలయాలను సాయంత్రం నాలుగు గంటలకు మూసివేశారు. గ్రహణానంతరం ఆలయాలను సోమవారం ఉదయం నాలుగు గంటలకు తెరుస్తారు. ఆలయ శుద్ధి, పుణ్యాహవచనం, గ్రహణశాంతి, మూలవిరాట్‌కు అభిషేకం చేశాక భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. ఇదిలా ఉంటే చంద్రగ్రహణం విషయం తెలియక ఆలయం మూతవేశాక వచ్చిన కొందరు యాత్రికులు.. స్వామిని దర్శించుకోలేక వెనుదిరగాల్సి వచ్చింది. ఆలయ ఈవో పెంచలకిషోర్, ప్రధాన అర్చకుడు సోమశేఖర్‌గురుకుల్, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

కార్వేటినగరంలో..

వెదురుకుప్పం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయాన్ని ఆదివారం మధ్యాహ్నం విరామ సమయం నుంచి టెంపుల్ ఇన్‌స్పెక్టరు సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఉద్యోగులు, అర్చకులు మూసివేశారు.

భక్తులతో కిక్కిరిసిన బోయకొండ

చౌడేపల్లె, సెప్టెంబరు7 (ఆంధ్రజ్యోతి):ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ ఆదివారం గంగమ్మ భక్తులతో కిక్కిరిసింది. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఏర్పాట్లను ఆలయ ఈవో, ఉపకమిషనర్ ఏకాంబరం పర్యవేక్షించారు.

మధ్యాహ్నం మూడు గంటలకు ఆలయం మూత

చంద్రగహణం సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని మధ్యాహ్నం మూడు గంటలకు మూతవేశారు. గ్రహనానంతరం సోమవారం ఉదయం ఆలయ శుద్ధి పుణ్యాహవచనం నిర్వహించాక భక్తులను దర్శనానికి అనుమతిస్తామని అధికారులు తెలిపారు.

క్వారీపై రగడ..?

నిర్వాహకులు, స్థానికుల మధ్య ఘర్షణ - పలువురికి గాయాలు



క్వారీ వద్ద స్థానికులు (ఇన్‌సెట్లో) గాయపడ్డ స్థానికుడు

వెదురుకుప్పం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం కొమరగుంట గ్రామ పంచాయతీ బందార్లపల్లె సమీపంలోని ఓ క్వారీ విషయంలో రగడ జరిగింది. అదికాస్తా నిర్వాహకులు, స్థానికుల మధ్య ఘర్షణకు దారితీయడంతో పలువురు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. బందార్లపల్లె వద్ద క్వారీకి ఎస్ఆర్‌పురం మండలం ఆరిమాకులపల్లె గ్రామానికి చెందిన శిల్ప వర్గీయులు 2017లో దరఖాస్తు చేసుకుని క్వారీ అనుమతులను ఆరు నెలల కిందట పొందినట్లు తెలిసింది. అయితే క్వారీకి అనుమతి ఇవ్వొద్దంటూ సుమారు నాలుగు నెలలుగా కలెక్టర్, తహసీల్దార్, పోలీసు, తదితర శాఖల వారికి స్థానికులు విజ్ఞప్తి చేస్తూనే ఉన్నారు. దీనిపై తహసీల్దార్ బాబు, ఎస్ఐ వెంకటసుబ్బయ్య బృందాలు మూడు, నాలుగుసార్లు అక్కడికెళ్లి పరిశీలించారు. ఇటీవల కలెక్టర్ ఉత్తర్వులతో జిల్లా బృందం కూడా పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. నిర్వాహకులు శనివారం క్వారీ వద్ద పనులు చేయడానికి వెళ్లగా బందార్లపల్లెకు చెందినవారు అడ్డగించారు. దీనిపై క్వారీకి సంబంధించిన యుగంధర్ అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో 13 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. కాగా, ఆదివారం కూడా క్వారీ పనులను గ్రామస్తులు అడ్డుకుని నిర్వాహకులతో వాగ్వాదానికి దిగారు. చివరకు అదికాస్తా ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. రెండువర్గాల వారికీ గాయాలైనట్లు తెలుస్తోంది. గాయపడ్డ బందార్లపల్లెవాసులు తిరుపతి రుయాస్పత్రికి చికిత్స నిమిత్తం తరలి వెళ్లారు. విషయం తెలియడంతో బందార్లపల్లెలో పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు. ఈ ఘటనపై ఆదివారం రాత్రి తొమ్మిది గంటల వరకు తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ తెలిపారు.

యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి: టీడీపీ

క్వారీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని పోలీసులను టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్‌బీ సుధాకర్‌రెడ్డి కోరారు. రైతుల విజ్ఞప్తులను కాదని క్వారీకి అనుమతులు ఇచ్చిన అధికారులపైనా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కాగా, గాయపడ్డ బందార్లపల్లెవాసులను తిరుపతిలో సుధాకర్‌రెడ్డి పరామర్శించారు.

బాధితులకు నారాయణస్వామి పరామర్శ

తిరుపతిలో రుయాస్పత్రిలో చికిత్స పొందుతున్న బందార్లపల్లెకు చెందిన బాధితులను ఆదివారం మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి పరామర్శించారు. క్వారీ పనులు ఆపకుంటే వైసీపీ తరఫున పోరాడతామని చెప్పారు.

క్వారీ యజమానులను వదిలిపెట్టం

రాష్ట్ర ప్రభుత్వ విప్ థామస్

క్వారీ యజమానులను వదిలి పెట్టే ప్రసక్తే లేదని రాష్ట్ర ప్రభుత్వ విప్ థామస్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం ఓ వీడియో విడుదల చేశారు. 'బందార్లపల్లె వాసులను క్వారీ నిర్వాహకులు కొట్టినట్లు సోషల్ మీడియాలో చూశాను. ఇది చాలా బాధాకరం. ఇలాంటివి సహించను. క్వారీకి అనుమతులున్నా స్థానికుల అనుమతి కూడా అవసరం. క్వారీతో పంటలు పాడైపోవడమే కాకుండా రకరకాల జబ్బులు వస్తాయి. ఇప్పటికే క్వారీ యజమానులపై కేసులు నమోదు చేయాలని వెదురుకుప్పం పోలీసులను ఆదేశించాం. అలాగే కలెక్టర్, ఎస్పీతో కూడా ఈ విషయమై చర్చించాను. ప్రజలకు అండగా ఉంటాం' అని థామస్ ఆ వీడియోలో పేర్కొన్నారు.

సచివాలయాలపై మూడంచెల పర్యవేక్షణ

● రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిల్లో ప్రత్యేక విభాగాలు

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చిన గత ప్రభుత్వ పాలకులు వాటిపై పర్యవేక్షణకు ఎలాంటి యంత్రాంగాన్ని ఏర్పాటు చేయలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ వ్యవస్థను ప్రక్షాళన చేసి మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా మూడంచెల పర్యవేక్షణ వ్యవస్థ ఏర్పాటుకు ఉత్తర్వులు విడుదల చేసింది. జిల్లాలో 612 గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి. వార్డు సచివాలయ కార్యదర్శి నుంచి డిజిటల్ అసిస్టెంట్ వరకు 11 మంది సిబ్బంది చొప్పున 4,497 మంది పనిచేస్తున్నారు. ప్రభుత్వ పథకాలు, ఇతర సేవలు క్షేత్రస్థాయిలో సచివాలయాల నుంచే అందుతున్నాయి. ఇక్కడి ఉద్యోగులంతా ఇంచుమించుగా ఒకే కేడర్‌కు చెందినవారు కావడంతో పర్యవేక్షణ కొరవడుతోంది.

తాజా వ్యవస్థ ఎలా ఉంటుందంటే

రాష్ట్రస్థాయిలో సెక్రటేరియట్, డైరెక్టరేట్‌లో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేస్తారు. జిల్లాలో డీఎల్‌డీవో, జేడీ స్థాయి అధికారిని గ్రామ, వార్డు సచివాలయాల అధికారిగా నియమిస్తారు. సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్లను డిప్యుటేషన్‌పై నియమించనున్నారు. వీరితో పాటు ఇద్దరు సాంకేతిక సమన్వయకర్తలు, నలుగురు జూనియర్ అసిస్టెంట్లు ఉంటారు. మండలస్థాయిలో గ్రామ, వార్డు సచివాలయ మండల అధికారి, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు ఉంటారు. వీరికి మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయనున్నారు. గ్రేడ్-1, 2 పురపాలక సంఘాల్లో మేనేజరు, ఒక సీనియర్ అసిస్టెంట్, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు ఉంటారు. నగర పంచాయతీల్లో ఒక సీనియర్ అసిస్టెంట్, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లను నియమించనున్నారు.

ఉత్తర్వులు వచ్చాయి



గ్రామ, వార్డు సచివాలయాల పర్యవేక్షణకు మూడంచెల వ్యవస్థ ఏర్పాటుకు గతవారం ఉత్తర్వులు వచ్చాయి. గ్రామ, వార్డు సచివాలయాలు వీటిపరిధిలో పనిచేసేలా ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది.

- రవికుమార్, గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా సమన్వయకర్త

పాలనాదక్షుడు సీఎం చంద్రబాబు

ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పాలనాదక్షుడు సీఎం చంద్రబాబు అని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలిసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి 30 ఏళ్లు పూర్తి చేసుకున్న చంద్రబాబు రాజకీయ ప్రస్థానాన్ని కొనియాడారు. సంక్షోభంలోనూ అవకాశాలను వెతికి.. గొప్ప సంస్కరణలకు శ్రీకారం చుట్టిన మహోన్నత వ్యక్తిగా అభివర్ణించారు. పేదల్లేని సమాజ స్థాపనే సంకల్పంగా ముందుకెళుతున్నటువంటి ముఖ్యమంత్రి నేతృత్వంలో పనిచేయడం ఆనందంగా ఉందని ఎంపీ పేర్కొన్నారు.

శ్రీకాళహస్తిలో గ్రహణ కాల అభిషేకం


దర్శనానికి వెళుతున్న భక్తులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం అర్ధరాత్రి గ్రహణ కాలం పురస్కరించుకుని మూలమూర్తులకు విశేష అభిషేకాలు నిర్వహించారు. రాత్రి 9గంటల వరకు ఆలయాన్ని యథావిధిగా తెరచి ఉంచి భక్తులకు రోజులాగే దర్శనం కల్పించారు. గ్రహణ కాలం అర్ధరాత్రి వేళ కావడంతో ఆ సమయంలో అభిషేకాలను ఏకాంతంగా నిర్వహించారు. వారాంతపు సెలవులు కావడంతో కావడంతోపాటు చంద్రగ్రహణం రోజున ముక్కంటి ఆలయం మాత్రమే తెరవడంతో తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 25వేలమంది దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

చెరువు నుంచి బాలుడి మృతదేహం వెలికితీత


చెరువు నుంచి యువన్ శేఖర్ మృతదేహాన్ని వెలుపలకు తీసుకొస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కుప్పం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కుప్పం పురపాలక సంఘం పరిధిలోని పరసముద్రం చెరువులో ఈత కొట్టడానికి వెళ్లి గల్లంతైన యువన్ శేఖర్ (17) మృతదేహాన్ని ఆదివారం అగ్నిమాపక సిబ్బంది అత్యంత ప్రయాసతో వెలికితీశారు. పరసముద్రం గ్రామానికి చెందిన యువన్ శేఖర్ శాంతిపురం మండలం తుమ్మిశి ఐటీఐలో చదువుతున్నాడు. మరో ఇద్దరు స్నేహితులతో కలిసి ఈనెల ఐదో తేదీన పరసముద్రం చెరువు వద్దకు వెళ్లాడు. హంద్రీ-నీవా కాలువ చెరువులో కలుస్తున్న ప్రాంత నుంచి ఈదుకుంటూ అవతలి కట్టకు ఎవరు ముందుకు చేరుతారన్న పందెం వేసుకుని స్నేహితులు చెరువులో ఈతకు దిగారు. మిగిలిన ఇద్దరూ చెరువు నుంచి బయటకు వచ్చేశారు. యువన్‌శేఖర్ మధ్యలోనే గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న గ్రామీణులు పోలీసులకు సమాచారమివ్వడంతో అగ్నిమాపక సిబ్బంది రంగంలోకి దిగి గాలింపు చర్యలు చేపట్టారు. చెరువులో ఇసుక, మట్టి తవ్వకాల కోసం చేసిన పదుల అడుగుల లోతైన గుంతలు ఉండటంతో గాలింపు కష్టసాధ్యంగా మారింది. శనివారం సాయంత్రం పాతాళ భైరవి సాయంతో సుమారు 20-25 అడుగుల లోతున యువన్ శేఖర్ మృతదేహాన్ని గుర్తించి బయటకు తీయడానికి ప్రయత్నించారు. అయితే మధ్యలోనే ఏదో అడ్డుపడటంతో ఆ ప్రయత్నం వృథా అయింది. చివరకు ఆదివారం ఉదయం మళ్లీ అగ్నిమాపక సిబ్బంది రంగంలోకి దిగారు. చెరువులో శనివారం గుర్తించిన ప్రాంతానికి వెళ్లి విస్తృతంగా గాలించారు. ఇదే ప్రాంతంలోని లోతైన గుంతలో మృతదేహాన్ని గుర్తించి కుప్పం అగ్నిమాపక అధికారి నేతాజి ఆధ్వర్యంలో సిబ్బంది పురుషోత్తం, బాలాజి, రామమూర్తి, రాజేశ్, వెంకటేశు, నరేశ్, విజయ, సుబ్రహ్మణ్యం, రఘుపతిలు వెలుపలకు తీసుకొచ్చారు.

భానుడి భగభగలు

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎండలు ఠారెత్తిస్తున్నాయి. వారం రోజులుగా వర్షాలు తగ్గుముఖం పట్టాయి. పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండుమూడు డిగ్రీలు ఎక్కువగా నమోదవుతున్నాయి. ఆదివారం చిత్తూరులో 36.1 డిగ్రీల పగటి ఉష్ణోగ్రత నమోదయ్యింది. సాధారణ ఉష్ణోగ్రతకు మించి ఎండలు మండుతున్నాయి. దీంతో జిల్లా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం 10 గంటల నుంచే సూరీడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. అత్యవసర పనులు ఉంటే తప్ప గ్రామీణ ప్రజలు చిత్తూరుకు రావడం తగ్గించుకున్నారు. ఎమ్మెస్సార్ సర్కిల్, గాంధీ సర్కిల్ వంటి ప్రధాన కూడళ్లన్నీ ఎండల కారణంగా బోసిపోయాయి.


చిత్తూరులో బోసిపోయిన గాంధీ సర్కిల్



నిందితులు - పాలేటమ్మ పురాతన శిరస్సును ఆలయ ధర్మకర్త ఎంకే బాలాజీకి అప్పగిస్తున్న పోలీసులు

పాలేటమ్మ పురాతన శిరస్సు అపహరణకు విఫలయత్నం

● దొంగలను పట్టుకుని పోలీసులకు అప్పగించిన గ్రామస్తులు

ఐరాల, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఐరాల నడిబొడ్డున ఉన్న పాలేటమ్మ ఆలయంలో ఆదివారం ఉదయం అమ్మవారి పురాతన శిరస్సును దుండగులు అపహరించడానికి విఫలయత్నం చేశారు. చంద్రగ్రహణం కావడంతో ఉదయం ఆలయంలో అమ్మవారికి భక్తులు పూజలు చేసి, వెలుపలకు వచ్చేశారు. తర్వాత కొంతమంది ఆలయంలోకి వెళ్లి అమ్మవారి పురాతన శిరస్సును సంచిలో వేసుకుని వెళ్లిపోయారు. పది నిమిషాల వ్యవధిలో ఈ విషయాన్ని ఆలయ ధర్మకర్త ఎంకే బాలాజి పెద్దకుమారుడు గౌతమ్ గమనించి స్థానికులకు తెలియజేశారు. దాంతో గ్రామస్తులు దొంగలు వెళ్లిన దిశగా వాహనాల్లో వెంబడించారు. వైఎస్ గేటు సమీపంలో వెళుతుండగా వారిని గుర్తించి పట్టుకుని ఐరాల పోలీసులకు అప్పగించారు. అమ్మవారి శిరస్సును ఎత్తుకెళ్లిన వారిని వైఎస్ గేటుకు చెందిన జయరామ్, ఐరాలకు చెందిన శ్రీరాములు, కురపపల్లెకు చెందిన హరిప్రసాద్, పాకాల మండలం గానుగపెంటకు చెందిన నీలగా గుర్తించారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అనంతరం అమ్మవారి పురాతన శిరస్సును ఆలయ ధర్మకర్త బాలాజీకి అప్పగించారు. ధర్మకర్త, గ్రామస్తులు ఆలయాన్ని శుద్ధి చేసి అమ్మవారి శిరస్సును గ్రామ పొలిమేరల్లో తిప్పి బలిహారం వేసి ఆలయంలో తిరిగి పెట్టారు. ఇలాంటివి పునరావృతం కాకుండా పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పుస్తకాలున్న ఇళ్లన్నీ విశ్వవిద్యాలయాలే..!

● మున్సిపల్ కమిషనర్ ఎస్.వి.రమణారెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ఎస్.వి.రమణారెడ్డి

పలమనేరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పుస్తకాలున్న ఇళ్లన్నీ విశ్వవిద్యాలయాలే అని పలమనేరు మున్సిపల్ కమిషనర్ ఎస్. వి.రమణారెడ్డి అన్నారు. ఆదివారం పలమనేరు రచయితల సంఘం, శాఖాగ్రంథాలయం, ఇతర సాంస్కృతిక సంస్థలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన 'పుస్తకంతో నడక' కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వయస్సుల వారు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రచయిత, పెద్దపంజాణి ఎంపీడీవో బాలాజీ మాట్లాడుతూ గ్రంథాలయాలకు పాఠకులను చేరువ చేసేందుకు, విద్యార్థులకు పుస్తక పఠనంపై ఆసక్తిని పెంచేందుకు కార్యక్రమాన్ని చేపట్టడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి హేమకుమార్, జనవిజ్ఞాన వేదిక నాయకులు యుగంధర్‌బాబు మాట్లాడుతూ గ్రంథాలయాలతో విద్యార్థులు తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవచ్చన్నారు. పలమనేరు రచయితల సంఘం కార్యదర్శులు డి.కుమారస్వామిరెడ్డి, జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి , తెలుగు సాహిత్య, సాంస్కృతిక సమితి అధ్యక్షులు పి.తులసినాథం నాయుడు, రైతు సంఘ నాయకులు ఉమాపతి నాయుడు, గ్రామసేవా సమితి శివాడి వి.రామ్మూర్తి, వి.ధనంజయ, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు తాతయ్య నాయుడు, రచయితలు మల్లిచెట్ల దేవేంద్ర, చంద్రశేఖరయ్య, దోర్నాదుల సిద్దార్థ, బీసీ సంక్షేమ వసతిగృహ అధికారి హేమసుందరరెడ్డి పాల్గొన్నారు.

క్రీడల్లో మరింత రాణించాలి



రగ్బీ క్రీడాకారిణి అక్షయను సన్మానిస్తున్న మధుమోహన్‌రావు

పలమనేరు, సెప్టెంబరు7 (ఆంధ్రజ్యోతి) : పలమనేరుకు చెందిన క్రీడాకారిణి అక్షయ క్రీడల్లో మరింత పట్టుదలతో కృషిచేసి ఉన్నత స్థాయికి ఎదగాలని సామాజిక కార్యకర్త మధుమోహన్‌రావు ఆకాంక్షించారు. ఇటీవల జరిగిన ఏషియన్ గేమ్స్‌లో అక్షయ రగ్బీ చాంపియన్ షిప్-2025 లో పాల్గొని కాంస్య పతకాన్ని సాధించారు. దీంతో ఆదివారం మధుమోహన్‌రావు అక్షయ ఇంటికి వెళ్లి శాలువతో ఘనంగా సన్మానించారు. పలమనేరుకు గుర్తింపు తీసుకొచ్చిన అక్షయను అభినందించారు.

భక్తిశ్రద్ధలతో ముగిసిన అక్కదేవతల ఉత్సవాలు



ప్రధాన ఆలయంలో అక్కదేవతలు

సోమల, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం గట్టువారిపల్లెలో కొలువుదీరిన అక్కదేవతల ఆలయంలో ఆదివారం ఉత్సవాలు ముగిసాయి. ఐదేళ్లకు ఒక పర్యాయం నిర్వహించే పూజా కార్యక్రమాలకు అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి పూజలు చేపట్టారు. ఈక్రమంలోనే ఉత్సవాల నిర్వహణకు సహకరించిన భక్తులకు నిర్వాహకులు అక్కదేవతల ప్రసాదాలు అందజేశారు. అలాగే ఆలయ అభివృద్ధి పనులకు విరాళాలు అందజేసిన దాతలను, టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులను సత్కరించారు.

వితంతు పింఛను ఇప్పించడయ్యా..!

● 18 నెలలుగా కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు

● అధికారులు బెదిస్తున్నారని ఆవేదన



రెడ్డెమ్మ

పుంగనూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తన భర్త చనిపోవడంతో అయనకు ఇచ్చే పింఛను తనకు వితంతు పింఛనుగా మార్చి తనను ఆదుకోవాలని పుంగనూరుకు చెందిన ఓ మహిళ గత 18 నెలలుగా అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తోంది. వార్డు సచివాలయం, మున్సిపల్ కమిషనర్, కలెక్టర్ వరకు వితంతు పింఛను ఇప్పించాలని వినతులతో అర్థిస్తున్నా స్పందన కరవైంది. బాధితురాలి కథనం మేరకు ..పుంగనూరు హనుమంతురాయదిన్నెకు చెందిన ఎర్రోళ్ల అంజప్ప, రెడ్డెమ్మ దంపతులు కూలీ పనులు చేసుకుని జీవనం సాగించేవారు. ఎర్రోళ్ల అంజప్పకు వృద్ధాప్య పింఛను వస్తుండగా.. గత ఏడాది జనవరిలో మృతి చెందాడు. దీంతో భర్తకు ఇస్తున్న పింఛను వితంతు పింఛనుగా మార్పు చేసి తనను ఆదుకోవాలని గత ఏడాది ఫిబ్రవరి నుంచే అధికారులకు అర్జీలు పెడుతోంది. వార్డు సచివాలయాల్లో ఇంకా వితంతువు పింఛన్లు ఇవ్వడం లేదని చెప్పి పంపేస్తుండటంతో ఆమె మూడు నెలల క్రితం చిత్తూరు కలెక్టర్ సుమిత్ కుమార్‌ను కలిసి వినతిపత్రం ఇవ్వగా మంజూరు చేస్తామని చెప్పడంతో ఆమె ఆశగా వచ్చింది. వార్డు సచివాలయంలో పనిచేసే ఓ అధికారికి చిత్తూరు కలెక్టరేట్ నుంచి పీజీఆర్ఎస్ అర్జీ రావడంతో ఆమె రెడ్డెమ్మను పిలిపించి 'మాపైనే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తావా ? ఎలా పింఛను వస్తుందో నేను చూస్తా' అంటూ ఆమెపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు రెడ్డెమ్మ ఆవేదన వ్యక్తం చేసింది. ఇప్పటికైనా స్పందించి తనకు వితంతు పింఛను ఇచ్చి ఆదుకోవాలని రెడ్డెమ్మ కోరుతోంది.

311 మందికి నేత్రపరీక్షలు



శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న నేత్రవైద్యులు మురళీ

పలమనేరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్యశిబిరంలో 70 మందికి వీరికి చెన్నై శంకర నేత్రాలయ నేత్ర వైద్యులు మురళీ నేత్రపరీక్షలు నిర్వహించారు. 40 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు.



వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

● **వి.కోట:** వి.కోట పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంలో అరవింద్ కంటి ఆసుపత్రిచే నిర్వహించిన వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. శ్యాం అగ్రి ఫౌండేషన్, అరవింద కంటి వైద్యశాల వారి సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన వైద్య శిబిరాన్ని ఆదివారం ఉదయాన్నే ఏఎంసీ మాజీ చైర్మన్ రామచంద్రనాయుడు చేతుల మీదుగా ప్రారంభించారు. మండల పరిధి నుండి సుమారు 241 మంది రోగులు శిబిరానికి హాజరుకాగా వారిలో 51 మందిని శస్త్ర చికిత్సల నిమిత్తం ఎంపికయ్యారు. కార్యక్రమంలో క్యాంప్ మేనేజర్ వాసుదేవరెడ్డి, ఆర్గనేజర్లు రెడ్డెప్పనాయుడు, ఉదయ్‌కుమార్, కుమార్ గుప్తా, డా. భావన, డా. స్ఫూర్తి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గ్రీవెన్స్ డే

కుప్పం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండల సచివాలయంలోని సమావేశపు హాలులో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒక గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కడా పీడీ వికాస్ మర్మత్ తెలిపారు. డివిజన్ స్థాయి వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు సైతం పాల్గొనే ఈ కార్యక్రమంలో ప్రజలు పాల్గొని తమ సమస్యలపై అర్జీలు సమర్పించి తక్షణ పరిష్కారాలు పొందాలని ఆయన కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

సోమల, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రైతులకు అండగా నిలబడి వైసీపీ మండల కమిటీలు పనిచేయాలని జడ్పీ మాజీ వైస్ చైర్మన్ పెద్దిరెడ్డి తెలిపారు. ఆదివారం సోమలలో మండల స్థాయి కార్యకర్తల సమావేశంలో అయన మాట్లాడుతూ రచ్చబండ కార్యక్రమంలో ప్రజా సమస్యలను చర్చించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో ఎంపీపీ ఈశ్వర్, వైస్ ఎంపీపీ ప్రభాకర్, ఏఎంసీ మాజీ చైర్మన్లు నాగేశ్వరరావు, అమాస మోహన్, మురళీ పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎట్టకేలకు జనసేన పార్టీ పతాక ఆవిష్కరణ

సోమల, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం సూరయ్యగారిపల్లె బస్టాండ్ వద్ద జనసేన పార్టీ పతాకాన్ని ఆదివారం స్థానిక జనసేన కార్యకర్తలు ఆవిష్కరణ చేశారు. గత గురువారం పార్టీ పతాకాన్ని, రోప్‌ను దుండగులు గల్లంతు చేశారు. పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు భూషణ్ రాయల్ సోమల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో స్థానికులు స్పందించి నూతన జెండాను ఆవిష్కరించి స్వీట్లు పంచారు.

నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు



కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలకు పూజలు చేస్తున్న అమీర్, గ్రామస్తులు

గుడిపల్లె, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గుడిపల్లె మండలం గుండ్ల సాగరం గ్రామంలో గత కొన్నేళ్ల క్రితం మూడు విద్యుత్ స్తంభాలు శిథిల దశకు చేరుకున్నాయి. గ్రామస్తులు వాటి స్థానంలో కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయింది. ఈ విషయాన్ని గ్రామస్తులు ఇటీవల రెస్కో డైరెక్టరుగా నియమితులైన జనసేన మండలాధ్యక్షుడు అమీర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన ఆదివారం రెస్కో సిబ్బందితో కలిసి శిథిల దశకు చేరుకున్న విద్యుత్ స్తంభాలను తొలగించి, వాటి స్థానంలో కొత్త స్తంభాలను ఏర్పాటు చేయించారు. తమ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేసిన అమీర్‌కు గ్రామస్తులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి



వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

పుంగనూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబునాయుడు ఇచ్చిన మాట ప్రకారం వాల్మీకులను ఎస్టీల జాబితాలో చేర్చాలని విశ్రాంత డీఎస్పీ, పుంగనూరు నియోజకవర్గ వాల్మీకి సంఘ నేత కే.సుకుమార్‌బాబు కోరారు. ఆదివారం స్థానిక ఇందిరా సర్కిల్‌లో వాల్మీకి మహర్షి విగ్రహానికి జిల్లా నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరిగే శాసనసభలో తమకు న్యాయం జరిగేలా సీఎం ఎస్టీ జాబితాలో చేరుస్తూ ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. మాజీ సీఎం జగన్ వల్లే మాట తప్పకుండా చంద్రబాబు నాయుడు తమ కోర్కెను తీర్చాలని కోరారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా వాల్మీకి సంఘ నాయకుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ కుప్పం సురేష్, నాయకులు జగదీశ్‌బాబు, భాస్కర్, అద్దాల నాగరాజ, నరసింహులు, ముత్తరాశి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రామస్వామి మృతికి సంతాపం



నివాళులర్పిస్తున్న వాల్మీకి సంఘ నాయకులు

పెద్దపంజాణి, సెప్టెంబర్ 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని స్థానిక తహసీల్దారు కార్యాలయ ఆవరణలో ఉన్న వాల్మీకి విగ్రహం వద్ద నియోజకవర్గ వాల్మీకి సంఘ నాయకులు ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వాల్మీకి సంఘ నాయకుడు, పెద్దపంజాణి పంచాయతీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు రామస్వామికి నివాళులు అర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. అనంతరం వారి కుటుంబానికి అండగా ఉంటామని పేర్కొన్నారు. వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో మృతుడి కుటుంబానికి రూ.30 వేలు నగదు అందజేశారు. భవిష్యత్తులో ఆ కుటుంబానికి అండగా ఉంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘ నాయకులు న్యాయవాది ఎల్.భాస్కర్, శివాడి శంకరప్ప, సింగిల్ విండో డైరక్టర్ గంగప్ప, చలపతి, డాక్టర్ సుబ్రహ్మణ్యం, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య భద్రతకు భరోసా యూనివర్సల్ హెల్త్ పాలసీ: టీడీపీ

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్య భద్రతకు భరోసా.. యూనివర్సల్ హెల్త్ పాలసీ అని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్ అన్నారు. ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ తాజాగా క్యాబినెట్ యూనివర్సల్ హెల్త్ పాలసీని ఆమోదించడం ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మకమైన నిర్ణయమని చెప్పారు. రాష్ట్రంలోని ఐదుకోట్ల మంది ప్రజలకు ఆరోగ్య బీమా కల్పించేందుకుగాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం ఆరోగ్యశ్రీని భ్రష్టుపట్టించడంతో పేద, మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు పడ్డారని అన్నారు. నేడు సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో తీసుకున్న యూనివర్సల్ హెల్త్ పాలసీ రాష్ట్ర ప్రజలందరికీ భరోసా కల్పించిందని చెప్పారు. టీడీపీ జిల్లా కార్యాలయ కార్యదర్శి మోహన్ రాజ్, చిత్తూరు నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షుడు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా జలాలతో నిండిన చెరువులు



రామకుప్పం మండలంలో కృష్ణాజలాలతో నిండిన అత్తికుప్పం వీరాశిచెరువు



రామకుప్పం మండలంలో కళకళలాడుతున్న మందలకుంట

రామకుప్పం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): హంద్రీ-నీవా కుప్పం కెనాల్ పుణ్యమాని వి.కోట, కుప్పం, రామకుప్పం మండలంలోని పలు చెరువులు కృష్ణాజలాలతో కళకళలాడుతున్నాయి. గత నెల 22న కృష్ణాజలాలు వి.కోట మండలంలోకి, 24న అవి కుప్పం నియోజకవర్గంలోకి ప్రవేశించాయి. 25న జలప్రవాహం ఎక్కువగా ఉండటం, శాంతిపురం సరిహద్దులో కాలువలో పేరుకుపోయిన మట్టిని తొలగించడానికి జలాలను అత్తికుప్పం విరాశీచెరువుకు మళ్లించారు. దీంతో నియోజకవర్గంలోనే కృష్ణాజలాలు మొట్టమొదటగా వీరాశిచెరువుకు చేరాయి. అనంతరం అక్కడి గేటును మూసివేసినప్పటికీ గేటు నుంచి చెప్పుకోదగ్గ స్థాయిలో జలాలు చెరువలోకి వస్తూనే ఉన్నాయి. ప్రసుత్తం వీరాశీ చెరువు నిండుకుండలా కళకళలాడుతోంది. అలాగే రామకుప్పం మండలం బైపరెడ్లపల్లె సమీపంలోని వి.కోట మండలానికి చెందిన మందలకుంట కృష్ణా జలాలతో నిండి మొరవ ప్రవహిస్తోంది. మొరవ ప్రవాహం ద్వారా జలాలు వి.కోట మండలం కొంగాటం చెరువుకు చేరుతోంది. మందలకుంట పూర్తిస్థాయిలో నిండటంతో చెరువు నలువైపులా ఆక్రమించిన భూముల్లో పండించిన పంటలు జలమయమైపోయాయి.



వి.కోట కీలపల్లె చెరువు వైపు పరుగులు తీస్తున్న కృష్ణా జలాలను ఆసక్తిగా చూస్తున్న ప్రజలు

కీలపల్లె చెరువు వైపు కృష్ణమ్మ పరవళ్లు

వి.కోట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వి.కోట మండలం దాసార్లపల్లె చెరువు పూర్తి స్థాయిలో నిండి శనివారం రాత్రి మొరవ ప్రవహించింది. జలవనరుల శాఖ వారు హంద్రీ-నీవా కాలువ నుంచి గత వారం రోజులుగా ఈ చెరువుకు నీటిని విడుదల చేయడంతో శనివారం రాత్రి చెరువు పూర్తి స్థాయిలో నిండి క్రింది భాగంలోని వి.కోట కీలపల్లె చెరువు వైపునకు పరవళ్లు తొక్కుతోంది. ఆదివారం ఉదయం గ్రామస్తులు మొరవ వద్ద గంగమ్మకు జలహారతులు ఇచ్చి, కృష్ణా జలాలకు పూజలు చేశారు. నాలుగేళ్ల అనంతరం దాసార్లపల్లె చెరువు మొరవ పారడం సంతోషకరమన్నారు. అలాగే ముదిమడుగు, పత్రపల్లె, కొత్తూరు, పైపల్లె చెరువులకు జలకళ సంతరించుకుంది. వి.కోట కీలపల్లె చెరువుకు హంద్రీ-నీవా జలాలు ప్రవహిస్తుండటంతో తమ ప్రాంతానికి నీటి సమజ్య తప్పుతుందని ఈ ప్రాంత రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నానో యూరియా శ్రేయస్కరం



పొలంలో అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ

గంగవరం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సీజన్‌లో అత్యధిక డిమాండ్‌గా ఉన్న యూరియాకు బదులుగా రైతులు నానో యూరియాను అలవాటు చేసుకోవడం శ్రేయస్కరమని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం గంగవరం మండలంలోని మారేడుపల్లె సచివాలయ పరిధిలోని రైతులకు నానోయూరియా వినియోగంపై పంటపొలాల వద్ద ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. సీజన్‌లో వరిపంటలు అత్యధిక స్థాయి లో సాగుచేస్తున్నారన్నారు. అయితే సాగుకు సరిపడే స్థాయిలో యూరియా నిల్వలు లేకపోవడం చూస్తున్నామని... యూరియాకు ప్రత్యామ్నాయమైన జీవన ఎరువులు, నానో యూరియా, పచ్చిరొట్టె ఎరువులు తదితర వాటిని వినియోగించుకోవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. పెట్టుబడి ఖర్చులు తగ్గి అధిక దిగుబడులు సాధించడంతోపాటు భూమిలోని సారాన్ని కాలుష్యం బారిన పడకుండా కాపాడుకోవచ్చన్నారు. అనంతరం గంగవరం పీఏసీఎస్‌లో యూరియా నిల్వలు, వాటికి సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి రకీబా, ప్రేమలత, ఆర్ఎస్‌కే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్‌కు బీసీ నాయకుల సన్మానం



నూతనంగా ఎంపికైన ఏఎంసీ చైర్మన్‌ను సన్మానిస్తున్న బీసీ సంఘ నాయకులు

గంగవరం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా ఎంపికైన ఆలకుప్పం రాజన్నను బీసీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఆదివారం ఆలకుప్పం గ్రామంలోని వారి నివాసానికి బీసీ నాయకులు చేరుకొని పూలమాలలు వేసి సత్కరించి అభినందనలు తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్మన్ బీసీలకు కేటాయించడం శుభ పరిణామమని, బీసీల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించి పరిష్కరించడానికి కృషిచేయాలని బీసీ నాయకులు రాజన్నకు విన్నవించారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు రవి, ప్రమోద్‌కుమార్, శేఖర్‌యాదవ్, రమేష్, శ్రీనివాసులు, మంజునాథాచారి, వెంకటేష్ లతోపాటు పలువురు పాల్గొన్నారు.

చంద్రగ్రహణంతో ఆలయాల మూత



కల్యాణ వెంకటరమణస్వామి ఆలయాన్ని మూసి వేస్తున్న టీటీడీ అధికారులు



రామకుప్పంలో మూసివేసిన వేంకటేశ్వరాలయం

పుంగనూరు, సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణం సందర్భంగా టీటీడీ పరిధిలోని పుంగనూరు కల్యాణ వెంకటరమణస్వామి ఆలయాన్ని అర్చకులు, ఆలయ అధికారులు ఆదివారం మధ్యాహ్నం మూసిశారు. ఆలయ టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ మధ్యాహ్నం 1.50 గంటలకు ఆలయాన్ని మూసివేసి 8వ తేదీన సోమవారం తెల్లవారు జామున 3 గంటలకు ఆలయం తెరిచి శుద్ధి, పుణ్యాహవచనం, అభిషేకం, గ్రహణానంతరం చేపట్టాల్సిన క్రతువులు అర్చకులు నిర్వహించి ఉదయం 5-30 గంటల నుంచి భక్తులకు స్వామి వారి దర్శనానికి అనుమతిస్తారని ఆయన వివరించారు. పౌర్ణమి సందర్భంగా నిర్వహించాల్సిన గరుడ సేవా కార్యక్రమాలు రద్దు చేసినట్లు తెలిపారు.

● రామకుప్పం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణాన్ని పురస్కరించుకుని రామకుప్పం పట్టణంలోని పలు ఆలయాలు మూతపడ్డాయి. పట్టణ శివార్లలోని ప్రసిద్ధ వళ్లీదేవసేన సుబ్రహ్మణ్యస్వామి ఆలయం, ఆలయ ఆవరణలోని నాగులముద్దమ్మ, శనీశ్వరస్వామి, పద్మావతి, వేంకటేశ్వరాలయాలతో పాటు పలు ఉప ఆలయాలు, పట్టణంలోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేరాలయాలను ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు మూసివేశారు.



చిత్తూరులో ఆదివారం రాత్రి 11.50 నుంచి 11.55 గంటల మధ్య కనిపించిన చంద్రగ్రహణం దృశ్యాలు

ఉన్నత విద్యతో పాటు విలువలు పెరగాలి



గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న ప్రముఖులు

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యతో పాటు విలువలు కూడా పెరగాలని బెంగళూరు విశ్వేశ్వరయ్య టెక్నలాజికల్ యూనివర్శిటీ, మాజీ వైస్ ఛాన్సలర్, ప్రొఫెసర్ కె.బాలవీరరెడ్డి అన్నారు. సీతం ఇంజనీరింగ్ కళాశాల రెండవ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఆదివారం స్థానిక శ్రీబాలత్రిపుర సుందరి వేదికలో నిర్వహించారు. బెల్గాం యూనివర్శిటీ నిమినీ ప్రొఫెసర్ బి.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ సాంకేతికతలో నైపుణ్యాలు పెంచుకుని రాణించాలన్నారు. అనంతరం కళాశాల చైర్మన్ రంగనాథం, ప్రిన్సిపాల్ వెంకటాచలపతి, తదితరులు యూజీ, పీజీ విభాగాల్లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న వారికి డిగ్రీ పత్రాలు అందజేశారు.

17 నుంచి బీజేపీ సేవా పక్వాడ్

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈనెల 17 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు సేవా పక్వాడ్ కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉమా, మాజీ ఎంపీ దుర్గారామకృష్ణ, జిల్లా ఇన్‌చార్జి విశ్వనాథ్ పేర్కొన్నారు.

రైతులందరికీ అందుబాటులో యూరియా



చౌడేపల్లెకు చేరిన యూరియాను దించుతున్న హమాలీలు

చౌడేపల్లె, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రైతులందరికీ రాయితీపై యూరియా అందుబాటులో ఉందని.. కావాల్సిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డుతో రైతు సేవా కేంద్రాల్లో సంప్రదిస్తే రాయితీపై యూరియా పొందొచ్చని ఏవో మోహన్‌కుమార్ తెలిపారు. మండలంలో 81 టన్నుల యూరియా అందుబాటులో ఉందని.. కావాల్సినంత నిల్వలు మళ్లీ వస్తాయని పేర్కొన్నారు.

నేటి నుంచి సరఫరా

● పుంగనూరు రూరల్: రైతులకు రాయితీతో సోమవారం నుంచి రైతు సేవా కేంద్రాల్లో యూరియా సరఫరా చేయనున్నట్లు పుంగనూరు ఏడీఏ శివకుమార్‌రాజు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పుంగనూరు, చౌడేపల్లె, సోమల, సదుం, పెద్దపంజాణి, గంగవరం మండలాల్లోని రైతు సేవా కేంద్రాల్లో నిల్వ చేశామని అవసరమైన రైతులు తమ భూమి పాసుపుస్తకాలు, ఆధార్ కార్డుల జిరాక్స్‌లను అందించి బయోమెట్రిక్ ద్వారా ప్రతి ఒక్కరికీ అందజేయడం జరుగుతుందన్నారు. పుంగనూరు సబ్ డివిజన్‌లో ఆగస్టు 31 వరకు బయోమెట్రిక్ పద్ధతితో 1463 మెట్రిక్‌టన్నులు యూరియా రైతులకు అందజేశామని చెప్పారు. ఈనెలలో ఇప్పటి వరకు ప్రైవేటు డీలర్లు అవుట్‌లెట్లలో 85 మెట్రిక్ టన్నుల యూరియా ఇచ్చామని, సోమవారం నుంచి పంపిణీకి 601 మెట్రిక్‌టన్నుల యూరియా పంపిణీకి సిద్ధంగా ఉందని తెలిపారు. వరి పంటలకు రైతులు తక్కువ మోతాదుల్లో యూరియా వాడాల్సి ఉందన్నారు. యూరియా అధికంగా వాడకంతో పంటకు తెగుళ్లు, చీడపీడల పురుగులు అధికంగా వ్యాప్తి చెంది పంటలు దెబ్బతిని రైతులు నష్టపోతారని చెప్పారు.

● **సదుం:** సదుం మండలంలోని పాలమంద, నడిగడ్డ, తిమ్మానాయనపల్లె, ఎర్రాతివారిపల్లె పంచాయతీలలో సోమవారం రాయితీపై యూరియా పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి సుధాకర్ తెలిపారు. రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ జిరాక్స్ తీసుకురావాలని కోరారు.

● **కల్లూరు:** పులిచెర్ల మండలం కల్లూరు, దిగువపోకలవారిపల్లి, దేవళంపేట, వెంకటదాసరపల్లి, పులిచెర్ల, కావేటిగారిపల్లి రైతు సేవా కేంద్రాల్లో సోమవారం నుంచి రైతులకు యూరియా పంపణీ చేయడం జరుగుతుందని వ్యవసాయాధికారి లీలాకుమారి తెలిపారు.

చంద్ర గ్రహణంతో ఆలయాల మూసివేత



మూసివేసిన కోదండ రామాలయం, అగస్త్యేశ్వరాలయం



గ్రహణం సందర్భంగా దర్భను కొనుగోలుచేస్తున్న నగరవాసులు

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణం కారణంగా నగరంలోని ఆలయాలు ఆదివారం మూతపడ్డాయి. సోమవారం వేకువజామున ఆలయాల శుద్ధి అనంతరం భక్తులకు భగవత్ దర్శనం కల్పించారు. స్థానిక కామాక్షి అంబికా సమేత అగస్త్యేశ్వర, నీవానది కాశీ విశాలాక్షి విశ్వేశ్వర, కట్టమంచి కులందేశ్వర, గిరింపేట శివగామి సుందరి సమేత చిదంబరేశ్వర ఆలయాల్లో గ్రహణ దోష నివారణ పూజలు నిర్వహించారు. కాగా నగరవాసులు చంద్ర గ్రహణం అనంతరం తమ పూర్వీకుల ఆత్మశాంతికై తర్పణాలు వదలడానికి అవసరమయ్యే దర్భలు, నువ్వులు, పూజా ద్రవ్యాల కొనుగోళ్ల కోసం బజార్లకు పోటెత్తారు.

సీఎం సహాయ నిధి పంపిణీ



సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

విజయపురం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలువురుకి ఆదివారం ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. మండలంలోని పోతురాజులు కండ్రిగకు చెందిన మహేశ్వరికి రూ.42,746లు, పన్నూరు ఆదిఆంధ్రవాడకు చెందిన పావనికి రూ.22,303లు అలపాకానికి చెందిన మునిరత్నమ్మకు రూ.86,957లు, కాళికాపురానికి చెందిన వినయకుమార్‌కు రూ.75,145ల చెక్కును పంపిణీ చేశారు. నగరి రూరల్ మండలం అడవికొత్తూరుకు చెందిన నాగరాజ్‌కు రూ.43,184లు, నిండ్ర మండలం అగరానికి చెందిన శంకరయ్యకు రూ.23,588లు, పుత్తూరు మండలం గొల్లపల్లికి చెందిన గంగాధరంకు రూ.40,000లు, పుత్తూరు మున్సిపాలిటీకి చెందిన రాజేంద్రకు రూ.92,737లు, బెస్తవీధికి చెందిన కన్నెమ్మకు రూ.30,028లు, కల్యాణపురానికి చెందిన కుసుమకు రూ.45,350లు, సత్యనారాయణపురానికి చెందిన ప్రసాద్‌కు రూ.61,572లు చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి దీక్ష తీసుకున్న ఎమ్మెల్యే



ఎమ్మెల్యే మురళీమోహన్‌కు జ్ఞాపికను అందిస్తున్న ఈవో పెంచలకిషోర్

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ ఆదివారం కాణిపాక క్షేత్రంలో అయ్యప్పస్వామి దీక్ష తీసుకున్నారు. ఆయన ఉదయం వరసిద్ధుడి ఆలయానికి విచ్చేసి స్వామికి పూజలు నిర్వహించి, అయ్యప్పస్వామి దీక్ష తీసుకున్నారు. అనంతరం ఆయన్ను ఆహ్వానించి స్వామి దర్శనం కల్పించారు. అలంకార మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించి, స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఈవో పెంచలకిషోర్, మాజీ చైర్మన్ మణినాయుడు తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా లక్ష్మీనారాయణుల కల్యాణం



సందీప్‌రెడ్డి కుటుంబసభ్యులకు స్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న అర్చకులు, మేనేజర్

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): వేపంజేరిలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేతుడైన లక్ష్మీనారాయణ స్వామి వార్లకు ఆదివారం రాత్రి నిర్వహించిన కల్యాణోత్సవాన్ని భక్తులు కనులపండువగా వీక్షించారు. చిత్తూరుకు చెందిన సందీప్‌రెడ్డి, తిరుపతికి చెందిన సందీప్‌రెడ్డి కుటుంబసభ్యులు కలిసి కల్యాణోత్సవం, అన్నదానం కార్యక్రమాలకు ఉభయదారులుగా వ్యవహరించారు. అదేవిధంగా ప్రధాన ఆలయంలో లక్ష్మీనారాయణస్వామి హోమం నిర్వహించగా, చిత్తూరుకు చెందిన అశోక్‌కుమార్, మాలతి, వరలక్ష్మి, శ్రేయ, బాల సుబ్రమణ్యంరెడ్డి, రేఖ ఉభయదారులుగా పాల్గొన్నారు. చంద్రగ్రహణం సందర్భంగా వేపంజేరి ఆలయాన్ని మధ్యాహ్నం 1 గంట నుంచే మూసివేశారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ నల్లా వెంకటేశులురెడ్డి, అర్చకులు విష్ణుస్వామి, గోవిందస్వామి, ద్వివేది, గౌరీష్, మురళీ, భక్తులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో చిత్తూరు క్రీడాకారుల ప్రతిభ



ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు

చిత్తూరు క్రీడలు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): గూడూరులోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో రాయ్ చెస్ అకాడమి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ స్టేట్ చెస్ ర్యాకింగ్ టోర్నమెంట్‌లో చిత్తూరు నగరానికి చెందిన పలువురు క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని ఏపీ చెస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ఆర్‌బీ ప్రసాద్ తెలిపారు. ఈ పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా 250 మంది క్రీడాకారులు పాల్గొన్నారని పేర్కొన్నారు. అండర్-8 విభాగంలో చిత్తూరు నగరానికి చెందిన ఎస్ఆర్ అర్జున్ రెండవ బహుమతిని గెలుపొందాడు. అలాగే వివిధ విభాగాల్లో ఎస్ఆర్ ఆర్యన్, అనంత్ నిత్య, నాగ మోహిత్, రామ్‌తేజ్‌లు కన్సొలేషన్ బహుమతులు పొందారు. వీరికి మెమెంటో, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. క్రీడాకారులను పలువురు అభినందించారు.

వైభవంగా రుద్రాభిషేకం



రుద్రహోమం నిర్వహిస్తున్న వేదపాఠశాల విద్యార్థులు

పాలసముద్రం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచపాళ్యంలో వున్న బాలగురునాథీశ్వరస్వామి ఆలయంలో ఆదివారం పౌర్ణమి సందర్భంగా రుద్రహోమాన్ని వైభవంగా నిర్వహించారు. తమిళనాడులోని చెన్నై శివారులో వున్న కామాక్షమ్మ వేదపాఠశాల విద్యార్థులు, అర్చకస్వాముల ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో రెండు కలశాలు ఏర్పాటుచేసి రుద్రహోమం నిర్వహించారు. అమ్మవారి విగ్రహాలకు బాలగురునాథీశ్వరస్వామి మూలవిరాట్‌కు అర్చకస్వాములు పూజలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

17 నుంచి బీజేపీ సేవా పక్వాడ్

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): దేశ ప్రధాని నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈనెల 17 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు సేవా పక్వాడ్ కార్యక్రమాలు చేపట్టాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఉమా, మాజీ రాజ్యసభ ఎంపీ దుర్గారామకృష్ణ, జిల్లా ఇన్‌చార్జి విశ్వనాథ్ సూచించారు. ఆదివారం బీజేపీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జగదీశ్వర్ నాయుడు, శ్రీనివాసులు అధ్యక్షతన సేవా పక్వాడ్ జిల్లా కార్యశాల సమావేశం జరిగింది. బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటిపై దాడి: పలువురిపై కేసు నమోదు



దగ్ధమైన గడ్డివామి, సుందరం ఇల్లు

బంగారుపాళ్యం, సెప్టెంబర్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలుతురుచేను గ్రామానికి చెందిన సుందరంకు చెందిన గడ్డివామికి నిప్పుపెట్టి, అక్రమంగా ఇంటిలోకి చొరబడి భయబ్రాంతులకు గురిచేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు సీఐ కత్తి శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. సీఐ కథనం మేరకు.. వెలుతురుచేనుకు చెందిన వేలు కుమారుడు ఉపేంద్ర గత నెల 14వ తేదీన ఆత్మహత్య చేసుకుని మృతిచెందిన సంఘటన విధితమే. తన కుమారుడు ఉపేంద్ర మరణానికి సుందరం కుటుంబ సభ్యులే కారణమని వేలు భావించాడు. ఈ క్రమంలో ఆదివారం వేలు, శారద, మరికొందరు కలిసి సుందరం ఇంటిలోకి చొరబడి రామలింగం, సోనియాలపై దాడి చేసి ఇంటిపక్కనే ఉన్న గడ్డివామికి నిప్పుపెట్టారు. ఈ మేరకు బాధితుడు సుందరం ఇచ్చిన ఫిర్యాదు మేరకు వేలు, శారదతోపాటు మరికొంతమందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో చెరకు తోట దగ్ధం



వెదురుకుప్పం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం బొమ్మయ్యపల్లి గ్రామ పంచాయతీ తెట్టుగుంటపల్లిలోని గుర్రం ప్రసాద్‌కు చెందిన చెరకు తోట ఆదివారం సాయంత్రం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయింది. ఈ సంఘటనలో ఐదు లక్షల రూపాయల వరకు నష్టం జరిగిందని బాధితుడు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

వైభవంగా గెరిగె ఊరేగింపు



నిండ్ర, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): నగరి పట్టణంలో గంగజాతర సందడి ఆదివారం మొదలైంది. జాతర సాంప్రదాయ ఆచార వ్యవహారాల్లో భాగంగా గంగమ్మతల్లికి ప్రీతికరమైన గెరిగె ఉత్సవాన్ని తలారి వీధి గంగమ్మ గుడి వద్ద నిర్వాహకులు ప్రారంభించారు. జాతర హద్దుల్లో ఉన్న ఇళ్ళకు ఊరేగింపుగా వెళ్లిన గెరిగెకు పసుపు కుంకుమల నీటితో హారతులు తీసి దర్శించుకున్న మహిళలు నైవేద్యం సమర్పించి బండారం స్వీకరించారు. గెరిగె ప్రారంభోత్సవంలో జాతర నిర్వాహకులు జ్యోతిరెడ్డి, చిరంజీవిరెడ్డి, టీకే మదన శ్రీనివాసన్, మణిగండ, శీను, బాలాజీ, జనార్ధన్, ప్రసాద్, సేడ్ రాజేష్, అశోక్, సునీల్, రవి, కుమార్, మహేష్, తిరుమల తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నేతకు మాతృవియోగం



నివాళులుఅర్పిస్తున్న చిట్టిబాబునాయుడు

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 7(ఆంధ్ర జ్యోతి): మండలంలోని కలిజవేడు పంచాయతీ కె.నాశంపల్లె గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్‌నేత లెక్కల పూడి ప్రభాకర్ నాయుడి తల్లి పద్మావతి (85) అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సమాచారం తెలుసుకున్న పలువురు టీడీపీనేతలు ఆదివారం కె.నాశంపల్లెలో పద్మావతి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడు, పార్లమెంట్ టీడీపీ ఎస్సీసెల్ ప్రధానకార్యదర్శి దేవసుందరం, మండల టీడీపీ ప్రధానకార్యదర్శి జ్యోతిరెడ్డి, నేతలు గుంటూరు దేవరాజులు నాయుడు, బెల్లంకొండ అశోక్ నాయుడు, నరసింహులు నాయుడు పాల్గొన్నారు.

ఘనంగా పౌర్ణమి పూజలు

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గిరింపేట ఎస్వీఆర్ క్లినిక్‌లో ఆదివారం వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి, మోదక గణపతికి పౌర్ణమి పూజలను డాక్టర్ రంగనాథన్, డాక్టర్ కార్తీక్‌లు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ పార్థసారథి నాయుడు, బాబు తదితరులు పాల్గొని పూజలు చేశారు.

● విజయపురం: మండలంలోని కోసలనగరం మిట్టూరు రామకృష్ణమ్మ ఆలయంలో, పన్నూరు ఆనందవల్లి ఇష్టకామేశ్వర ఆలయంలో, చెంగమనాయుడు కండ్రిగ వద్ద ఆదివారం ఆరుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహకులు వాసుదేవస్వామి, బాలసుబ్రహ్మణ్యశర్మ, నాయకులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం



పూతలపట్టు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఇటీవల అనారోగ్య కారణంగా మృతిచెందిన పారిశుధ్య కార్మికుడి కుటుంబానికి సహచర కార్మికులు ఆదివారం ఆర్థిక సాయం అందించారు. పూతలపట్టు మండలం వేపనపల్లి పంచాయతీ బూసిపల్లి దళితవాడకు చెందిన నాగరాజు కుమారుడు మునిరత్నం చిత్తూరు నగరపాలక సంస్థలో పారిశుధ్య కార్మికుడిగా పని చేస్తూ మృతిచెందాడు. ఈ సందర్భంగా శానిటరి ఇన్‌స్పెక్టర్ కేశవరాజు, మేస్త్రి రాంబాబు ఆధ్వర్యంలో సహచర కార్మికులు మృతుడి కుటుంబానికి రూ.10,500 ఆర్థిక సాయం అందించారు.

భాగవత పద్యాలు ఆణిముత్యాలు

ఐరాల (కాణిపాకం), సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): భాగవత పద్యాలు ఆణిముత్యాల్లాంటివని ఉపాధ్యాయిని శాంతా భాస్కర్ అన్నారు. కాణిపాక వినాయకస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆమె కాణిపాకంలో భాగవతాన్ని వినిపించారు. ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ భాగవతంలోని కొన్ని పద్యాలనైనా నేర్చుకోవాలని సూచించారు.

ఉద్యోగ విరమణ సన్మానం



హెచ్‌ఎం గంగాధరం దంపతులను సన్మానిస్తున్న టీచర్ యూనియన్ నేతలు

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 7(ఆంధ్ర జ్యోతి): గంగాధరనెల్లూరు మండలం అక్కన గారిపల్లె స్కూల్లో హెడ్‌మాస్టర్‌గా పదవీ విరమణ చేసిన గంగాధరం దంపతులకు ఆదివారం శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సన్మానం చేశారు. ఎంఈవోలు ఆంజనేయులుశెట్టి, గుణశేఖర్‌రెడ్డి, టీచర్ యూనియన్ సంఘం నేతలు గిరిప్రసాద్‌రెడ్డి, చెన్న కేశవరెడ్డి, పురుషోత్తం, కమలాపతి నాయుడు, శాంతి, చంద్రశేఖర్ రెడ్డి, చలపతి, నాగరాజనాయుడులు పాల్గొన్నారు.

నేడు నగరపాలక కార్యాలయంలో 'పీజీఆర్ఎస్'

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): నగరపాలక కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని కమిషనర్ నరసింహ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తామని తెలిపారు.







వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో ఆదివారం ఉదయం రావణబ్రహ్మ వాహన సేవ కోసం ఉత్సవ విగ్రహాలను తీసుకొస్తున్న ఏఈవో రవీంద్రబాబు, ఉభయదారులు - గ్రామోత్సవాల్లో కోలాటం చేస్తున్న కళాకారులు - నృత్యం చేస్తున్న కళాకారిణి

'మార్కెట్ కాంప్లెక్స్' పూర్తయ్యేదెప్పుడు?





పునాదులకే పరిమితమైన కాంప్లెక్స్ నిర్మాణం - టార్పాలిన్ పట్టల కింద విక్రయాలు జరుపుతున్న వ్యాపారులు

నగరి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నగరి పట్టణ నడిబొడ్డున కోట్ల రూపాయల విలువైన సంత మైదానంలో చేపట్టిన దినసరి మార్కెట్ కాంప్లెక్స్ నిర్మాణం పునాదులకే పరిమితమైంది. గత ప్రభుత్వ హయాంలో మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో చేపట్టిన తీర్మానంతో గుడ్‌విల్ ప్రాతిపదికన ఇక్కడ భవన సముదాయాన్ని నిర్మించడానికి బహిరంగ వేలం ద్వారా కాంట్రాక్టర్లను పిలిచారు. శంకుస్థాపనా చేశారు. అయినా ఇప్పటికీ పూర్తవలేదు.

రూ.2.36 కోట్లతో పనులు

గుడ్‌విల్ పద్ధతిలో 31 గదుల నిర్మాణాన్ని రూ.2.36 కోట్లతో చేపట్టాలని నిర్ణయించి తొలి విడతగా కాంట్రాక్టర్ల నుంచి రూ.62 లక్షలు వసూలు చేసి పనులు ప్రారంభించారు. సంత మైదానంలో ఒకవైపు దినసరి మార్కెట్ కోసం పునాదులు తీయడంతో వారపుసంతకు స్థలం తగ్గిపోయింది. చివరకు రోడ్డుపైనే వ్యాపారాలు చేయాల్సి వస్తోంది. దీనివల్ల వ్యాపారులకు, జనానికి ఇబ్బందులు తప్పడం లేదు.

వైభవంగా ఆదిపరాశక్తి ఆలయ మహా కుంభాభిషేకం





మహా కుంభాభిషేకం వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, మాజీ మంత్రి రోజా

నిండ్ర, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన నిండ్ర దళితవాడలో నూతనంగా నిర్మించిన మేల్‌మరువత్తూరు ఆదిపరాశక్తి అమ్మవారి ఆలయ మహా కుంభాభిషేకం వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. శనివారం రాత్రి అమ్మవారి చిత్రపటాన్ని వివిధ పుష్పాలతో విశేషంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. ఆదివారం ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకం, యాగం నిర్వహించి అమ్మవారికి ప్రాణప్రతిష్ఠ చేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పాల్గొనగా, అర్చకులు పూజలు నిర్వహించి వేదమంత్రాల మధ్య ప్రత్యేక ఆశీర్వాదాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అదే విధంగా మాజీ మంత్రి రోజా పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఓం శక్తి భక్తులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యతో పాటు విలువలు పెరగాలి



గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న ప్రముఖులు

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యతో పాటు విలువలు కూడా పెరగాలని బెంగళూరు విశ్వేశ్వరయ్య టెక్నలాజికల్ యూనివర్శిటీ, మాజీ వైస్ ఛాన్సలర్, ప్రొఫెసర్ కె.బాలవీరరెడ్డి అన్నారు. సీతం ఇంజనీరింగ్ కళాశాల రెండవ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఆదివారం స్థానిక శ్రీబాలత్రిపుర సుందరి వేదికలో నిర్వహించారు. బెల్గాం యూనివర్శిటీ నిమినీ ప్రొఫెసర్ బి.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ చేసే పనిలో నిబద్ధతతో పాటు సాంకేతికతలో నైపుణ్యాలు పెంచుకుని రాణించాలన్నారు. అనంతరం కళాశాల చైర్మన్ రంగనాథం, ప్రిన్సిపాల్ వెంకటాచలపతి, తదితరులు యూజీ, పీజీ విభాగాల్లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న వారికి డిగ్రీ పత్రాలు అందజేశారు.

టీడీపీ దళితుల ఆత్మీయ సమావేశం



పూతలపట్టు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): పూతలపట్టు మండలం దళితుల ఆత్మీయ సమావేశం ఆదివారం మండల ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు సుబ్బరాజులు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలోనే దళితులు అభివృద్ధి చెందారని కొనియాడారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు తప్పుడు కేసులకు భయపడకుండా పార్టీకోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ఎస్సీసెల్ కార్యదర్శి ఆనగల్లు మునిరత్నం, మాజీ ఎంపీటీసీ రమేష్, నేతలు వీరభద్రయ్య, నటరాజ్, నాగేంద్ర, ఎత్తిరాజులు, ముత్తు, కృష్ణయ్య, రమేష్, పూర్ణ, చెంగల్రాయులు, శరత్‌బాబు, భాస్కర్, మురళి, సుబ్రహ్మణ్యం, నాగరాజు, నీలకంఠ తదితరులు పాల్గొన్నారు.


నగదు పురస్కారాల పంపిణీ



నగదు పారితోషికాలు అందుకున్న విద్యార్థులు

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): నగరంలోని కొంగారెడ్డిపల్లె ఉషానగర్ కాలనీ సత్యసాయి భజనమండలి వ్యవస్థాపకులు ఆర్.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం 15 మంది విద్యార్థులకు నగదు పురస్కారాలు పంపిణీ చేశారు. వీరిలో ప్రవల్లిక, సంజనకు రూ.1000, మాలతి, జీవిత, కార్తీక్, కీర్తి, మోక్షిత, అశ్విత, దేవి, లహరి, యామిని, విజయలక్ష్మిలకు రూ.500ల చొప్పున సత్యసాయి సేవాసమితి జిల్లా అధ్యక్షులు మధుసూదనం అందజేశారు. గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో చంద్ర గ్రహణ దోష నివారణ పూజలుజరిగాయి. నగర కన్వీనర్ ప్రభాకర్ నాయుడు, కల్పన, శంకర్, సావిత్రి, సత్యనారాయణ, దేవరాజులు, గజేంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా సత్యనారాయణ స్వామి వ్రతం



బంగారుపాళ్యం, సెప్టెంబర్ 7(ఆంధ్రజ్యోతి): పౌర్ణమిని పురస్కరించుకుని మాధవనగర్ వద్ద ఉన్న బ్రహ్మానంద ఆశ్రమంలో ఆదివారం వైభవంగా సత్యనారాయణ స్వామి వ్రత పూజలు జరిగాయి. సత్యనారాయణ స్వామి చిత్రపటానికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఉభయదారులుగా బోదబండ్ల గ్రామానికి చెందిన చంద్రయ్య కుటుంబ సభ్యులు వ్యవహరించారు. భక్తులకు అన్నప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు కేశవానందస్వామి, సుబ్రమణ్యంరెడ్డి, నరసింహులు నాయుడు, సుధాకర్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య భద్రతకు భరోసా యూనివర్సల్ హెల్త్ పాలసీ: టీడీపీ



మాట్లాడుతున్న సురేంద్ర కుమార్

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్య భద్రతకు భరోసా.. యూనివర్సల్ హెల్త్ పాలసీ అని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్ అన్నారు. ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ తాజాగా క్యాబినెట్ యూనివర్సల్ హెల్త్ పాలసీని ఆమోదించడం ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మకమైన నిర్ణయమని చెప్పారు. రాష్ట్రంలోని ఐదుకోట్ల మంది ప్రజలకు ఆరోగ్య బీమా కల్పించేందుకుగాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం ఆరోగ్యశ్రీని భ్రష్టుపట్టించడంతో పేద, మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు పడ్డారని అన్నారు. నేడు సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో తీసుకున్న యూనివర్సల్ హెల్త్ పాలసీ రాష్ట్ర ప్రజలందరికీ భరోసా కల్పించిందని చెప్పారు. టీడీపీ జిల్లా కార్యాలయ కార్యదర్శి మోహన్ రాజ్, చిత్తూరు నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షుడు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనం

పూతలపట్టు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని తేనేపల్లి పంచాయతీ బిడారిమిట్ట గ్రామంలో గత మూడురోజులుగా జరుగుతున్న వినాయకస్వామి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారి నిమజ్జన కార్యక్రమం వైభవంగా జరిగింది. ఉదయం 11 గంటలకు మంగళవాయిద్యాలు, బాణసంచా వేడుకల మధ్య ప్రారంభమైన ఊరేగింపు సాయంత్రం 3 గంటలకు సమీపాన గల నీవానదిలో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత బుల్లెట్ నరేష్ రెడ్డి, మధు, రాజేష్, సాగర్, సురేష్, శ్రీనివాసులు, కిషోర్, గోపి, అశోక్, రవి, రెడ్డెప్ప, బాబు, మణి, బిడారిమిట్ట గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తితో గౌరవం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎస్‌కే రాజా

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవ ప్రదమైనదని విశ్రాంత హెచ్‌ఎం రాజారెడ్డి అన్నారు. ఏపీ ప్రైవేటు అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపుస్మా) జిల్లా అధ్యక్షుడు సీఆర్ మహేష్ అధ్యక్షతన ఆదివారం స్థానిక ఓ హోటల్‌లో సంఘం జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భావితరానికి విద్యార్థులను తీర్చిదిద్దడంలో ప్రైవేటు పాఠశాలల టీచర్ల పాత్ర ప్రశంసనీయమన్నారు. అనంతరం 70 మంది గురువులను సన్మానించారు. ముఖ్య గురువు చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణ, కోశాధికారి ఎంపీఎం లక్ష్మీప్రసాద్, విజయం విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి, దేవీ స్కూల్ కరస్పాండెంట్ ప్రసాద్, ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

వైసీపీ నాయకులది అసత్య ప్రచారం

నిండ్ర, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంపై వైసీపీ నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారని నగరి పీఏసీఎస్ చైర్మన్ బాలాజీ ఆదివారం ఒక ప్రకటనలో ఖండించారు. రైతు సంరక్షణమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు పనిచేస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే భానుప్రకాష్ ఆదేశాల మేరకు నగరిలో సుమారు 78 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని, మండలంలోని శ్రీసాయి ఫర్టిలైజర్స్(బుగ్గ అగ్రహారం), నగరిలోని ప్రాథమిక సహకార సంఘం, బైసాని మునస్వామిశెట్టి, శ్రీకృష్ణ ఫర్టిలైజర్స్ షాపుల్లో, దామరపాకం, ఎం.కొత్తూరు, గుండ్రాజుకుప్పం రైతు సేవా కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

నేటి నుంచి ఎరువుల పంపిణీ

విజయపురం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలో రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయాధికారి రజనీకుమారి తెలిపారు. విజయపురం, అలపాకం, పన్నూరు, జగన్నాథపురం, శ్రీహరిపురం, కాళికాపురం రైతుసేవా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. యూరియా రూ.266.5, డీఏపీ రూ.1341 చొప్పున సోమవారం నుంచి అందిస్తున్నట్టు ఆమె తెలిపారు.

● వెదురుకుప్పం: మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో యూరియా పంపిణీ చేస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి వి.వనిత తెలిపారు. ఆధార్ కార్డు, పట్టదారు పాసుపుస్తకం తీసుకెళ్లి యూరియా కొనుగోలు చేసుకోవచ్చని, ఇతర వివరాలకు వెదురుకుప్పం వ్యవసాయాధికారి 83310 57816 నెంబరును సంప్రదించాలని సూచించారు.